
# ఆలంబన

వాలి హిరణ్మయీదేవి



సాయంత్రపు సంధ్యాకాంతులు, సౌభాగ్య చెంపలపై బడి, ఆమెలో వింత అందాన్ని ఆపాదిస్తుంటే తన్మయుడై ఆమె వంకే చూడసాగాడు మోహన్. ఎందుకో తలతిప్పిన సౌభాగ్య ''ఏంటీ'' అన్నట్టుగా కనుబొమల్ని సుతారంగా పైకిలేపి అడిగింది భర్తని.

''నీ అందం ప్రమిద కాంతిలా వెలిగిపోతుంటేనూ'' అన్నాడతను.

''ఇంకా నయం. పెట్రోమాక్స్‌లైట్ అన్నారు గాదు' అందామె నవ్వుతూ.

''అదెక్కువ కాంతినిచ్చేమాట నిజమే గానీ, ప్రమిద నుండి వచ్చే వెలుగు కంటికింపుగా ఉంటుందోయ్. గోదారి నదిలో, కార్తీకమాసంలో అరటి దొప్పల్లో వదిలిన దీపాల అందం నీలో కన్పిస్తూ వుంటుంది - కరెక్ట్‌గా చెప్పాలంటే'' అన్నాడతను లేచి ఆమె పక్కన కూర్చుంటూ.

''లేచారూ... ఇక నేను ప్రకృతి అందాన్ని ఆస్వాదించినట్లే'' అందామె.

''ఇంతసేపూ నువ్వు ఆస్వాదించావ్- మరి

నేనూ ఆస్వాదించాలిగా'' అన్నాడామె ఒళ్ళో పడుకుంటూ ''అచ్చంగా ఉయ్యాలూగుతున్నట్లే వుంది. అందుకే రైలు ప్రయాణాలని ఎంజాయ్ చేస్తుంటాను.''

''అందులోనూ కూపే బుక్‌చేసి మరీనూ'' అతని మాటలని పూర్తిచేస్తూ అంది తన నడుము ముడతలని సవరిస్తున్న అతని చేతుల్ని పట్టుకొంటూ ''అబ్బ చక్కిలిగిలి'' అంది.

''మరి నలుగురిలో సరాగాలు తప్పంటావ్ కదాని 'కూపే' బుక్‌చేశాను. నాకు నువ్వు – నీకు నేను – అన్న ఫీలింగ్ వుంటుంది. ఏం నీకలా లేదా? '' అన్నాడు తను లేచి ఆమెను ఒళ్ళోకి లాక్కుంటూ. ఆమె ముంగురుల్ని సవరిస్తూ ''నెలరోజులు ఎంతలో గడిచిపోయాయ్. ఏదేమైనా మన హనీమూన్ దివ్యంగా జరిగింది కదూ'' అన్నాడు మోహన్.

''అవును – నిముషాలు క్షణాల్లా దొర్లిపోయాయ్'' అందామె హస్కీ వాయిస్‌తో.

అతను మెల్లగా వంగి ఆమె కళ్ళమీద ముద్దుపెట్టుకున్నాడు. సంపంగి వంటి ఆమె ముక్కుని స్పర్శిస్తూ – పగడాల వంటి ఆమె పెదవులే తన గమ్యస్థానమన్నట్లు, తన పెదవులను అక్కడ ఆన్చాడు – పెదవులు చాలాసేపు కుశల ప్రశ్నలు వేసుకొన్నయ్ ఎన్నోఏళ్ళ తర్వాత కలిసిన ఆప్తమిత్రుల్లా.

''ఎవరన్నారవి కన్నులని – అరరే మధుపాలికే గిన్నెలవి – ఎవరన్నారవి బుగ్గలని – ఎర్రని రోజా మొగ్గలని'' అంటూ అతడు హమ్ చేస్తుంటే ''అబ్బో అయ్యగారికి ఎప్పటిపాటలో బాగానే గుర్తుకొస్తున్నాయ్'' అంది అతడిని ఇష్టంగా అల్లుకుపోతూ. ఆ కౌగిలి పలికే ఆహ్వానానికి, ఆమె నుండి వస్తోన్న వింత పరిమళానికి ఎప్పట్లాగే అతడు – పరవశుడయ్యాడు. ఆమె అందాలను కనులారా చూస్తూ ''తనివి తీరలేదే – నా మనసు నిండలేదే'' అనుకొంటూ ఆమెను పొదివి పట్టుకొన్నాడు. అతడి చేతుల్లో మైనపు ముద్దే అయింది సౌభాగ్య. తీయటి అలసటతో క్షణాల్లో నిద్రలోకి జారుకొంది. తృప్తి నిండిన కళ్ళతో ఆమెను చుంబిస్తున్న మోహన్, ఆమె నుదుటిన వున్న గాయాన్ని – ఆప్యాయంగా తడుముతూ గతంలోకి జారుకొన్నాడు.

★★★

''ఏయ్, సౌభాగ్యా – ఇటు – ఇటు'' అంటూ చప్పట్లు కొడుతూ పిలిచాడు మోహన్.

''ఏమిటీ వింత? నీ మోహనుడింత ధైర్యంగా పిలుస్తున్నాడు'' అంటూ ఆట పట్టించింది సౌభాగ్య స్నేహితురాలు రాణి.

ఆశ్చర్యంగా అతడినే చూసిన సౌభాగ్య నిశిత దృష్టికి, అతడు ఆందోళనతో వున్నాడని స్పష్టంగా తెలిసి, గబగబా ఎదురెళ్ళింది.

''మీ నాన్నగారు నిన్ను ఉన్నపళంగా తీసుకురమ్మన్నారు – పద'' అన్నాడతను తన నుదుటను అలుముకొన్న స్వేద బిందువుల్ని కర్చీఫ్‌తో అద్దుకొంటూ.

''ఏం ఎందుకు?'' కాస్త కంగారుగా అడిగింది.

''మరేం లేదు. చిన్న పని ఉందిట – ముందు బైక్ ఎక్కు చెబుతాగానీ'' అన్నాడు మోహన్.

''ఏంటీ? తమ్ముడి బైక్‌నిచ్చి మరీ పంపారా? దేనికి'' ఆరాటంగా అడిగింది.

''మోహన్‌తో చనువుగా ఉండొద్దు – ట్యూషన్ వరకే పరిమితం – ఎక్కడివారినక్కడ ఉంచడం నేర్చుకో'' అనే తన తండ్రి ఏకంగా మోహన్‌నే పంపించారంటే – కారణం ఏమై వుంటుందోనని – ''మోహన్ అందరూ బాగానే వున్నారు కదా'' అంది ఆదుర్దాగా.

''ఆ.. అందరూ బాగున్నారు'' అన్నాడతను. ఆమె బైక్ ఎక్కింది. అతని సామీప్యం ఆమెకి తెలీని ఆనందం కల్గిస్తూండగా – ఎదురుగా వచ్చిన మేక పిల్లని తప్పించడానికి సడెన్‌గా కట్ చేసేసరికి కుదిపినట్లయి – పడిపోతానేమోనన్న భయంతో సౌభాగ్య, మోహన్ నడుమును బలంగా పట్టుకొంది. మోహన్ ఒళ్ళు ఝల్లుమంది. అలాంటి పులకరింత అతని అనుభవంలో లేదింతవరకు. 'ఏంటో –ఈ పిల్ల కన్పిస్తే చాలు మనసూ, శరీరం అదుపు తప్పిపోతాయి' అనుకున్నాడు మనసులో. ఆమెనెంతో ప్రాణంగా ఆరాధిస్తున్నానడతను. ఆ మూగ ఆరాధనని పసిగట్టిన సౌభాగ్య, ఆ ప్రేమకు, అతని మంచితనానికి ముగ్ధురాలై మొలలోతు ప్రేమలో కూరుకుపోయింది. తన ప్రేమని ఎన్నిసార్లు బహిర్గతం చేసినా అతడు నిశ్చలంగా ఉండిపోవడం కోపాన్ని కల్గచేసింది ప్రతీసారి. ''తన సౌభాగ్య పరాధీన అయిపోతే ఇక తను 'నడిచేశవం'గా తప్ప మనిషిగా మనగలడా'' అనుకొంటూ నిట్టూర్చాడు మోహన్.

''ఈ ప్రయాణం ఇలా అనంతంగా సాగిపోతే ఎంత బావుంటుంది'' అంది ట్రాన్స్‌లో వున్నట్లు.

''ఎలా కుదురుతుంది?'' అన్నాడు మోహన్ బలవంతంగా గొంతుపెగల్చుకొని.

అతని కంఠంలో గరగరలాడుతున్న దుఃఖాన్నిట్టే పసిగట్టింది సౌభాగ్య.

''ఏయ్ స్టాప్ – ప్లీజ్ స్టాప్'' అంది గట్టిగా.

ఆ అరుపులకి భయపడి టక్కున ఆపాడతను. వెంటనే దిగింది సౌభాగ్య.

''ఇప్పుడు చెప్పు – నాన్నగారు నన్నెందుకు తీసుకురమ్మన్నారు?'' తీక్షణంగా చూస్తూ సౌభాగ్య అనేసరికి.

''అదీ... అదీ.. నిన్ను చూసుకోవడానికి ఎవరో వస్తున్నారట – అందుకే అర్జంటుగా నిన్ను – అతడి మాటలింకా పూర్తిగాకుండానే ''ఛీ సిగ్గులేదూ. నన్నెవరో చూడ్డానికి వస్తారంటే – నువ్విలా దగ్గరుండి నన్ను తీసుకువెడుతున్నావా? నువ్వసలు – అసలు'' ఇంకా ఏమనాలో తోచక తలపట్టుకొంది సౌభాగ్య.

''సౌభాగ్యా! ప్రాక్టికల్‌గా ఆలోచించడం నేర్చుకో. నన్ను కట్టుకొంటే నువ్వేం సుఖపడలేవని మీ నాన్నగారి అభిప్రాయం''.

''అదలా వుండనీ – నీ అభిప్రాయం చెప్పు. మనం సుఖంగా వుండలేమా?'' ఖరాఖండిగా అడిగింది సౌభాగ్య. మౌనంగా ఉండిపోయాడు మోహన్.



''మోహన్ నీ మౌనంతో నన్ను చంపొద్దు. నువ్ మా నాన్నగారి దగ్గర చేసేపాటి ఉద్యోగం మరెక్కడా రాదా? నీ సంపాదన చాలకుంటే నేనూ జాబ్ చేస్తాను – సరా – అసలు నిన్నొదిలి నేనెలా ఉండగలను? పోనీ నువ్ చెప్పు. ఉండగలవా?'' అంది ఆవేశంగా అతని చొక్కాని పట్టుకొంటూ. మెల్లిగా ఆమె చేతుల్ని విడిపించుకుంటూ ''మీ నాన్నగారు నన్ను నమ్మి జాబ్ ఇచ్చారు. మరెంతో నమ్మకంతో నీకు ట్యూషన్ చెప్పమన్నారు. అలాంటి మీ నాన్నగారికి నమ్మకద్రోహం చేయడం భావ్యమా?''

''ఐతే ఆత్మవంచన చేసుకుంటూ బతకడమే భావ్యమా?'' హతాశురాలౌతూ అడిగిందామె. తలొంచుకున్నాడు మోహన్.

''నీ చిరుస్పర్శలకే పరవశించిపోతానే – నిన్ను తప్ప మరెవరినీ భర్తగా ఊహించుకోలేనే – అలాంటి నన్ను... నన్ను'' మరింత మాట్లాడలేక భోరుమంది సౌభాగ్య.

మోహన్ కదిలిపోయాడు.

''సౌభాగ్యా! మన అంతస్థుల్లోని తేడాల వల్ల నీకు దూరంగా వుంటూ వచ్చానుగానీ నిన్ను తల్చుకోకుండా ఒక్కక్షణం ఉండలేను'' అన్నాడామెని పొదివి పట్టుకొని.

''మరింకేం – ఇదే మాట మా నాన్నతో చెప్పు'' పంతంగా అందామె.

ఒకటో క్లాస్ చదువుతున్న పిల్లవంక చూసినట్లు చూశాడామెను. ''మీ నాన్నగారు ఒప్పుకొంటారనే? నాకెన్నో బరువు బాధ్యతలున్నాయి సౌభాగ్య. అందుకేగా అందర్నీ వదిలిరావటం బాధనిపించినా వదిలి ఒంటరిగా ఇక్కడుంటున్నది. నన్ను కట్టుకొంటే ఆ మరునిముషం నుండే నువ్వు బాధలుపడవలసి వస్తుంది'' అన్నాడు వేదనగా.

గుళ్ళో పెళ్ళి చేసుకొని, పూలదండలతో వచ్చిన మోహన్ సౌభాగ్యలను చూస్తూనే కోపంతో ఊగిపోయాడు సౌభాగ్య తండ్రి. అతడెంత దూషించినా మోహన్ నిశ్చలంగా ఉండిపోయాడు. సౌభాగ్యే భరించలేక ''ఆయనన్నెన్ని మాటలంటే అవన్నీ నన్నన్నట్లే'' అంది. ఒళ్ళు తెలీని కోపంతో చేతికర్ర బలంగా విసిరాడు మోహన్ పైకి. మోహన్‌ని వెంటనే పక్కకు లాగడానికి ముందుకొచ్చిన సౌభాగ్య నుదుటికి గట్టిగా దెబ్బ తగిలి రక్తం చివ్వున చిమ్మింది.

సౌభాగ్య తల్లి పరుగున రాబోగా ''అదింక మనకు చచ్చిందాంతో లెక్క'' అంటూ ఆమెను తీసుకొని, లోపలికి వెళ్ళి తలుపులు మూసేశాడు.

మోహన్ డాక్టర్ దగ్గరికి తీసికెడితే, సౌభాగ్య నుదుటికి మూడు కుట్లు వేసి, కట్టుకట్టాడు. అలా ఆ మచ్చ శాశ్వతంగా ఆమె మోహంలో చోటుచేసుకుంది.

సౌభాగ్య తండ్రి పరపతికి జడిసి, ఎవరూ వారికి ఆశ్రయమీయకపోవడంతో ఆ రాత్రికి గుళ్ళోనే తలదాచుకొన్నారు.



జేబు తడుముకొంటే నాల్గొందలు తగిలాయి మోహన్‌కి. కట్టుబట్టలతో హైద్రాబాద్ చేరుకున్నారు - వెయిటింగ్ రూమ్‌లో ఆమెని వుంచి.

''నేను మా ఫ్రెండ్ కోసం ప్రయత్నిస్తాను. ముందు మన తలదాచుకోవడానికి ప్లేస్ దొరికితే మిగతాది చూడొచ్చు మెల్లగా'' అన్నాడు మోహన్.

'సరేనంది' సౌభాగ్య. ముందు అత్తగారి ఊరికే వెడదామంది ఆమె. కానీ బరువు బాధ్యతలని వదిలేసి గొడవపడి పెళ్ళి చేసుకొన్నానని తెలిస్తే వాళ్ళు తట్టుకోలేరని మోహన్ చెప్పడం వల్ల సరేననక తప్పలేదామెకి.

ఆమె చేతికో యాభై రూపాయలిచ్చి ఫ్రెండ్ వేటలో పడ్డాడు మోహన్. ఆ సాయంత్రం నిరాశగా తిరిగివచ్చిన మోహన్‌ని చూస్తూనే గ్రహించింది సౌభాగ్య ఫలితం ఏంటో.

ఆ మరునాడు స్టేషన్ మాస్టర్‌ని బతిమాలుకుని, సౌభాగ్యనక్కడే ఉంచి మళ్ళీ బయలుదేరాడు మోహన్ - జేబులో మిగిలిన పది రూపాయల నోటు తడుముకుంటూ.

ఈసారి అడ్రస్ దొరికింది కానీ అతడు 'అవుటాఫ్ స్టేషన్ అని రావడానికి ఇంకో నాలుగు రోజులు పట్టొచ్చని' చెప్పారు - దాంతో నిరాశగా వెనుదిరిగాడు.

''సౌభాగ్యా! చూశావా! నన్ను కట్టుకొన్న దగ్గర్నుండీ ఎన్ని బాధలో. వంటిమీదున్న బట్టలు తప్ప వేరేవీ లేక రెండ్రోజుల్నుండి స్నానం చేయటం లేదు. మొదటిరోజు రెండుపూటలా ఏదో నాసిరకం భోజనం ఇప్పించాను. నిన్న ఒక్కపూటే తిన్నాం. ఇవాళ అదీ లేదు. టీ నీళ్ళతో కడుపు నింపుకోవాలి. నిన్ను ఇన్ని బాధలు పెట్టలేకనే - మనసులోనే ప్రేమ దాచుకున్నాను. ఇప్పుడు చెప్పు. నాకోసం మరిన్ని బాధలు పడగలవా?'' అడిగాడు మోహన్ గద్గదస్వరంతో

''రాత్రంతా చలికి ముడుచుకుపడుకొంటే ఎంత బాధేసిందో''.

''నువ్వూ నాతో ఇన్ని బాధలు పడుతున్నావుగా మోహన్'' అందామె, అతన్ని వారిస్తూ.

''నాకు బాధలు అలవాటే - నీకలా కాదుగా. సరే - ఇవాళ ఒకతను రమ్మని చెప్పాడు. వెళతాను - జాగ్రత్త'' అంటూ వెళ్ళాడు. ఆ సాయంత్రం అతను తిరిగి వచ్చేసరికి స్టేషన్ బైట నిలబడి వుంది సౌభాగ్య - చుట్టూ కొందరు ఆకతాయి మూక నిలబడి ఇష్టం వచ్చినట్టు కామెంట్స్ చేస్తుంటే కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ వుంది. అది చూసిన మోహన్ ఒంట్లోని రక్తం సలసలా మరిగింది.

'అనువుగాని చోట అధికులమనరాదు' అంటూ సౌభాగ్యే అతన్ని ఆ పక్కనున్న గార్డెన్‌లోకి తీసుకెళ్ళింది. చూస్తుండగానే చీకట్లు ముసరసాగాయి. తోటమాలి, ఓ మూల ఒదిగి కూర్చున్న ఆ జంట వంక అనుమానంగా చూస్తూ ''ఊ.. ఊ బైటకు నడవండి'' అన్నాడు కటువుగా. బతిమాలుకొని - మిగిలిన రెండు రూపాయల బిళ్ళ అతని చేతిలో పెట్టి మోహన్ చేతులు జోడించే సరికి, ఇక ఏమన లేక వెళ్ళిపోయాడు. బెంచిమీద ముడుచుకుపడుకున్న సౌభాగ్యకి కన్నీళ్ళతో కాపలా కాశాడా రాత్రి.

''మోహన్ నువ్వేమీ అనుకోకుంటే నా మెళ్ళోని గొలుసిస్తాను. దాన్ని తాకట్టుపెట్టో, అమ్మయినా సరే - ఏ చిన్న హోటలులోనైనా ఓ రూమ్ తీసుకో. రోజంతా నేనెక్కడ ఉండగలను? నిన్ననే ప్రాణం చచ్చిపోయింది. ప్లీజ్'' అంటూ గొలుసు తీసి అతని చేతిలో పెట్టింది. పరిస్థితులర్థమైన అతను కిమ్మనకుండా, మనసులో ఎంతో సిగ్గుపడుతూనే ఆమె చెప్పినట్లు చేశాడు. నాల్రోజులు అతిభారంగా గడిచాయి.

ఐదో రోజున మోహన్ ఫ్రెండ్ గౌతమ్ కలిశాడు. మోహన్ కథ మొత్తం వివరించాడు.

''అరెరె. ఎంతపని జరిగింది. కనీసం ఆ అమ్మాయిని మా ఇంటికైనా తీసుకెళ్ళొద్దా'' అంటూ కోప్పడ్డాడు.

**నేనీ ఊరొచ్చేరోజు చేతిలో చిల్లిగవ్వ లేకుంటే - మీ అమ్మగారే అప్పట్లో నాకు వంద రూపాయలిచ్చారు. ఆ చల్లని తల్లి ఇచ్చిన వేళా విశేషమో ఏమో - డబ్బుకిబ్బంది లేకుండా జరిగిపోతోంది నాకు.**

ఆ తర్వాత ఇద్దరూ మాటల్లో ఓ నిర్ణయానికి వచ్చారు. ఆ ఫైనెలలో అతడు ఎప్పట్నుంచో ట్రై చేస్తున్న ఫారిన్ టూర్ ఉంది. అందుకే బిజినెస్‌ను 'లీజ్'కి మోహన్‌కిచ్చేసే విధంగా రాతకోతలు జరిపాడు. మోహన్ ఆశ్చర్యంలో మునిగిపోయాడు - ''చిన్న పని దొరికితే చాలు' అనుకొన్న తనకి, ఏ పెట్టుబడీ లేకుండా బిజినెస్ లీజ్‌కు లభించడంతో. ఇదంతా సౌభాగ్య తన జీవితంలో అడుగుపెట్టిన వేళావిశేషమే అనుకొన్నాడు. ''మోహన్, మీరో ఇల్లు చూసుకునేవరకూ మా ఇంట్లోనే ఉండొచ్చు. ఇవాళే నీ భార్యని తీసుకొని వచ్చెయ్'' అన్నాడు గౌతమ్.

''నువ్వు చేస్తున్న ఈ సాయానికి ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలీడం లేదురా'' అన్నాడు మోహన్.

''అరేయ్. నేనే మీ ఋణం తీర్చుకొంటున్నానురా. ఎలాగంటే నేనీ ఊరొచ్చేరోజు చేతిలో చిల్లిగవ్వ లేకుంటే - మీ అమ్మగారే అప్పట్లో నాకు వంద రూపాయలిచ్చారు. ఆ చల్లని తల్లి ఇచ్చిన వేళా విశేషమో ఏమో - డబ్బుకిబ్బంది లేకుండా జరిగిపోతోంది నాకు'' అన్నాడు గౌతమ్.

ఆరోజే సౌభాగ్యని గౌతం ఇంటికి తీసుకువెళ్ళాడు మోహన్. గౌతమ్ భార్య మనీషను చూస్తూనే ''నువ్వు జగన్నాధం మావయ్య కూతురివి కదూ'' అంటూ కౌగిలించేసుకొంది. ఎవరిల్లో, ఏంటోనని బెరుకుగా వచ్చిన సౌభాగ్య మొహం విప్పారింది.

''ఏవండీ! అప్పట్లో మా నాన్నగారికి సాయం చేసింది వీళ్ళ నాన్నగారే. రాకపోకలు తక్కువ గావడంతో - ఇదుగో ఇన్నేళ్ళకి మళ్ళీ కలుసుకొన్నాం'' అందామె.

''మా అమ్మానాన్నలు ఎవరికిపడితే వారికి సాయం చేసే ఇల్లు గుల్ల చేసుకున్నారని అప్పుడప్పుడే విసుక్కునేవాడిని - కానీ ఇప్పుడర్థమవుతోంది - మన పెద్దలు చేసిన పుణ్యమే మనకోదారి చూపిస్తుందని'' మనస్ఫూర్తిగా అన్నాడు మోహన్.

''నీకు మీ మామగారి మీద కోపం లేదా?'' ఆసక్తిగా అడిగాడు గౌతమ్.

''ఉహు. ఆ స్థానంలో నేనున్నా అలాగే ప్రవర్తించేవాడిని - కూతురు హాయిగా ఉండాలని కోరుకోని తండ్రి వుంటాడేంటి?'' అన్నాడతను.

ఆ మాటలు సౌభాగ్య మనసులో ముద్రించుకుపోయి - అతడి మీద గౌరవం హెచ్చయింది.

గౌతమ్, మోహన్‌లు కారులో ఆఫీస్‌కి వెళ్ళగానే, ఓ ఐదు నిముషాలు మాత్రం సౌభాగ్యతో మాట్లాడి ''ఓ పని గుర్తొచ్చింది. అరగంటలో వచ్చేస్తాను'' అంటూ సడెన్‌గా లేచింది మనీష. ఆమె అలా తనని ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోవడం సౌభాగ్య మనసుకి కష్టంగా తోచినా ''తమకో దారి చూపించినవాళ్ళు'' అనుకొంటూ సరిపెట్టుకుంది.

సాయంత్రం ఐదవుతుండగా ''సౌభాగ్యా. హరియప్ - నాతో పద'' అంటూ మరో మాటకి ఆస్కారమీయకుండా బయలుదేరదీసింది. మరో అరగంటకల్లా వారి తోటకు చేరుకున్నారు.పచ్చటిచెట్లు స్వాగతిస్తూ చల్లటి గాలిలో ఒళ్ళంతా నిమిరి ఆప్యాయంగా రమ్మని పిలిచాయామెను. ''సౌభాగ్యా - నేనలా తోటమాలితో మాట్లాడి వస్తాను. ఈ కీ తీసుకో. తలుపు తెరు'' అంటూ తాళంచెవి ఇచ్చింది. తాళంతీసి తలుపు తీసి లోపలికి వెళ్ళింది సౌభాగ్య. వెల్ ఫర్నిష్డ్ హాలు. గోడలకి మాంచి సీనరీస్ వాల్ హాంగింగ్స్‌తో కనిపించింది. కిచెన్ అంతే - సామానంతా అప్పటికప్పుడు సర్దినట్లుగా కన్పించింది. ఆశ్చర్యపడుతూనే బెడ్‌రూమ్ తలుపు తెరచింది. తొంగిచూస్తూనే ఆశ్చర్యపోయింది. ఎత్తయిన మంచం, పూలతో - పూల దండలతో చక్కగా అలంకరించబడి వుంది. పక్కనే ప్లేటులో పళ్ళూ, స్వీట్స్, అగరొత్తులు గుచ్చిన వెండి స్టాండ్. చూస్తూనే సిగ్గు ముంచుకువచ్చిందామెకి. సుమ సౌరభాలు మత్తెక్కించేలా వున్నాయ్.

'ఐతే ఈ ఏర్పాట్లన్నీ చేయడానికా మనీష తననొంటరిగా వదిలి వచ్చింది. అనవసరంగా అపార్థం చేసుకున్నానే' అనుకోగానే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'ఇవన్నీ తన తల్లి ఏర్పాటు చేయవలసినవి - తల్లిలా ఆమె చేసింది' అనుకుంటూ మనసులోనే థాంక్స్ చెప్పుకొంది.

''ఏయ్ - సౌభాగ్యా. ఏంటింకా అలా నిలబడ్డావ్. స్నానం చేసిరా. చీర - అవీ అక్కడే వున్నాయి. అసలే నీది పెద్ద జుట్టు. ఆరాలిగా'' అంటూ ఆమె హడావుడి చేస్తోంటే, చటుక్కున వంగి ఆమె కాళ్ళకి నమస్కరిస్తూ ఏడ్చేసింది సౌభాగ్య.

''పిచ్చి! ఏంటిది? నా చెల్లెలికైతే చేయనా? ఊ - ఈ ఏడ్పే ఇక చివరిదవ్వాలి. జీవితంలో మరె

ప్పుడూ నీ కంట తడి చూడకూడదు నేను. ఊ హర్రీయప్. మీ వారొచ్చేటప్పటికి చక్కగా తయారవ్వాలి. ఇప్పటికే వారం రోజులు వేస్ట్ అయిపోయాయ్'' అంది కొంటెగా కన్ను గీటుతూ.

పావుగంటలో చకచకా సౌభాగ్యని అలంకరించింది. ఇంతలో కారాగటం, మోహన్ కాలు పెట్టడం జరిగాయి.

''ఇక మేం ఉంటాం – గుడ్‌నైట్ – స్వీట్ డ్రీమ్స్'' అంటూ సెలవు తీసుకున్నారు వాళ్ళిద్దరూ.

సౌభాగ్య వంక ప్రఫుల్ల వదనంతో చూస్తూ – తానూ ఫ్రెష్అప్ అయి వచ్చాడు మోహన్.

తెల్లటి పైజమా, లాల్చీలతో – నవమోహనంగా కన్పిస్తోన్న మోహన్‌ని చూస్తూ – అంతవరకూ అతని జీవితంలో ప్రవేశించి – అతనికి బాధ కలిగించానన్న ఫీలింగ్‌లో ఉన్న సౌభాగ్య తేలిగ్గా నిట్టూర్చింది. 'తాను చేసిన పనెంతో కరెక్ట్' అనుకొంది రిలాక్స్‌డ్‌గా.

మోహన్ తనని సమీపిస్తూంటే – ఎక్కడ్లేని సిగ్గు కమ్ముకొచ్చింది. అతడామె దగ్గరకు వచ్చి ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని, కౌగిలింతకనుమతిమ్మన్నట్లుగా ఆమె పెదవులపై 'ముద్దు' దరఖాస్తు పెట్టుకొన్నాడు. వణుకుతున్న ఆమె ఎర్రని పెదవుల భయాన్ని తీర్చడానికన్నట్లు తన పెదవులతో వాటిని లోపలికి తీసుకున్నాడు. అంతే కాలం ఆగిపోయింది. ఆ దీర్ఘచుంబన రుచిని ఆస్వాదిస్తున్న ఆమె శరీరం వివశమయిపోయింది. పెదవుల పని పెదవులు చేస్తోంటే తన చేతులకు పనిచెప్పాడు – తమకంతో బిగువయిన జాకెట్ హుక్స్‌ని తప్పించడానికి. నిలువలేక పోయింది సౌభాగ్య. తనను అతడింకా ముద్దగా నలిపేస్తే బాగుండునన్న ఆరాటంతో ఆమె అతడ్ని గట్టిగా హత్తుకొంది. ఆ కౌగిలి పలికే ఆహ్వానంతో అతని మనసు ఎగిసిపడింది. నిష్ణాతుడైన వైణికుడిలా ఆమె మేనునే వీణగా మార్చుకొన్నాడు – ఆమెలో మధురమయిన ప్రకంపనలు. కోర్కెల జలపాతపు హోరులో ఇద్దరూ తడిసి ముద్దయిపోయారు. నీటి చెలమకై వెదికే దాహార్తుడిలా అతని అన్వేషణ మొదలయింది. ఆమె సహకారంతో దోసిళ్ళకొద్దీ తీయని తేనె లభించడంతో పరిపూర్ణంగా ఆమె దాహాన్ని తీరుస్తూ – తనూ దప్పిక తీర్చుకొన్నాడు. ఆ మరుకేళిలో సొక్కి సోలిపోయారు. ఆ కమ్మటి తన్మయత్వం – మధురమయిన సహచర్యం వారికి ఆ మరునాడు తొందరగా మెలకువ రానీయలేదు. ఇంత అందమయిన అనుభూతి తమకు కలిగేలా ఏర్పాటుచేసిన మనీషా దంపతులకు కృతజ్ఞతలు చెప్పుకొన్నారు – అలా అలా మొదలయిన వారి దాంపత్యం అన్యోన్యతకి ప్రతీకలా నిలిచింది.

బిజినెస్ లాభాల పథంలో సాగిపోసాగింది. సౌభాగ్య కూడా కొడుకు, కూతురు కాస్త పెద్ద కాగానే – అతనికి అండగా నిలబడింది.

అందుకే మోహన్ పెదవుల మీదెప్పుడూ

''ఆలనగా – పాలనగా అలసిన వేళల

అమ్మవుగా – లాలించు నా దానివై దేవీ'' పాట అలవోకగా కదలాడుతుంటుంది.

''నువ్వు నిజంగా నాపాలిటి సౌభాగ్యానివే'' అంటూ ఎంతో అపురూపంగా చూసుకునే మోహన్ని అంతకంటె ప్రాణంగా చూసుకోవడం సౌభాగ్య వంతు.

బిజినెస్ మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరించగానే బంధుత్వాలన్నీ మళ్ళీ కలిశాయి. అటు పుట్టింటివాళ్ళని, ఇటు అత్తింటివాళ్ళనీ సమంగా ఆదరిస్తూ – ఆది దంపతులకు మారుపేరయ్యారు సౌభాగ్య మోహన్‌లు.

తూరుపు రేఖా కాంతులకి మెలకువ వచ్చి కదిలింది సౌభాగ్య – దాంతో అతడీ లోకంలోకి వచ్చాడు.

''మెనీ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'' ఆమె చెవిలో గుసగుసగా అంటూ – నుదుటిని చుంబించాడు మోహన్. బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ఫ్రెషయి వస్తూ –

''ఏంటీ కళ్ళెర్రగా వున్నాయ్. రాత్రంతా నిద్రపోలేదూ'' అడిగిందతన్ని ఆపేక్షగా.

''నిద్రపోతే ఎలా – నా అదృష్టదేవత కళ్ళు విప్పగానే శుభాకాంక్షలు తెలియజేయడం ఎలా?''

**నీటి చెలమకై వెదికే దాహార్తుడిలా అతని అన్వేషణ మొదలయింది. ఆమె సహకారంతో దోసిళ్ళకొద్దీ తీయని తేనె లభించడంతో పరిపూర్ణంగా ఆమె దాహాన్ని తీరుస్తూ – తనూ దప్పిక తీర్చుకొన్నాడు.**

అన్నాడతను.

''వట్టి శుభాకాంక్షలేనా?'' అందామె కవ్విస్తున్నట్లుగా.

''ఏం కావాలని ఎప్పుడడిగినా ఏమీ వద్దంటావుగా. అందుకే అడగలేదు. సరే – ఈసారి నీ అంతట నువ్ నోరువిప్పి అడిగావు గనుక అదే కోరికయినా సరే శాంక్షన్ చేసేస్తా'' హుషారుగా అన్నాడు మోహన్.

''ప్రేమించి – అందర్ని ఎదిరించి బైటకు వచ్చేసినా – భగవంతుడి దయవల్ల హాపీగా వున్నాం. సుఖవంతమయిన జీవితాన్ని గడుపుతున్నాం. మనలా పెద్దల సపోర్ట్ లేకుండా పెళ్ళి చేసుకొన్న జంటలకు కాస్త నీడనిచ్చే ప్రేమసదనాన్ని ఏర్పాటు చేయాలన్నది – నా మనసులో చిరకాలంగా మెదుల్తోన్న కోరిక. ఎందుకంటే ఎవరి సపోర్ట్ లేకుండా గడిపిన ఆ నాలుగైదు రోజులు గుర్తుకు వస్తే ఇప్పటికీ ఎంతో భయం వేస్తూంటుంది. అదో పీడకల – అలాంటిది నిజమైన ప్రేమికులెవరూ అనుభవించకూడదు. ప్రేమించి, పెద్దలనెదిరించలేక ఆత్మహత్యలు చేసుకున్న జంటలను గురించి చదివినప్పుడూ, ప్రేమ పెళ్ళిళ్ళు చేసుకొని ఆ తరువాత తిండిబట్టా కరువై బలవంతంగా ప్రాణాల్ని తీసుకున్న వారిని గురించి చదివినప్పుడూ మనసు అల్లకల్లోలానికి గురి అవుతుంటుంది. గౌతమ్ – మనీషాల తోడ్పాటు లేకుంటే మనకథా విషాదాంతం అయ్యేదేమో. అందుకే అలాంటివారి బాధల్ని తొలగించి, వారికో బాట ఏర్పడేదాకా ఓ 'సదనాన్ని' తలదాచుకొనేందుకు ఏర్పాటు చేయండి. అదే మీరు నాకిచ్చే బహుమతి'' అంది సౌభాగ్య.



తనకోసం కాక పరుల గురించి ఆలోచించే ఆమె పెద్దమనసుకి ముచ్చటపడుతూ ''ఆ ఏర్పాటు చేయొచ్చుగానీ కొందరు, ఎలాంటివారుంటారంటే తిండిబట్టా – నీడా దొరుకుతుందంటే రకరకాల అబద్ధాలు చెప్పి పరాన్నజీవుల్లా బతికేస్తుంటారు. అదీగాక 'ప్రేమ పెళ్ళిళ్ళలో ఎన్నో బాధలుండగా – వాటిని మీరు ప్రోత్సహించడం ఏంటి' అని విమర్శించే వారూ వుంటారు. ఇలాంటివి చాలా ఆలోచించాలి'' అన్నాడప్పుడే మనసులో వాటిని అధిగమించేందుకు ఓ ప్లాన్‌ని వేసుకొంటూ.

''మీరన్నదాంట్లో నిజముంది గానీ ఎవరెలాంటివాళ్ళో పసిగట్టే నేర్పుంది మీకు. మీరు స్ట్రిక్ట్‌గా ఓ కండిషన్ పెట్టండి. 'ఓ నిర్ణీత కాలంలో జీవనోపాధి వెదుక్కొని వెళ్ళాలని'. అదీగాక మన ఫ్యాక్టరీలకి ఎందరో అవసరమవుతూనే వుంటారు. మనవాళ్ళ రీప్లేస్‌మెంట్ ఆఫీసులూ వున్నాయి– వారివారి క్వాలిఫికేషన్స్‌ని తగ్గట్లు అవకాశాల్ని కల్పిద్దాం. మీరు తలచుకోవాలేగానీ అన్నీ సాల్వ్ చేయగలరు'' అందామె ఎంతో నమ్మకంగా. రైలు నిశ్చింతగా పరుగులు తీస్తోంది.

★★★

''ఆ... ఆ స్టేషన్ వచ్చేస్తోంది. మన పిల్లలూ – మనవలూ మనకోసం వచ్చి ఉంటారు'' అంది చిన్నపిల్లలా సంబరపడుతూ సౌభాగ్య.

''ఎప్పుడూ బిజీగా వుంటారు. హనీమూన్‌కి అప్పట్లో వెళ్ళలేకపోయారు. ఇప్పుడైనా వెళ్ళండంటూ ఏర్పాటుచేసిన ఈ ట్రిప్ ఎంత బావుంది. నాకు నువ్వు – నీకు నేను' అంటూ అన్ని టెన్షన్లని మరచి ఓ కొత్తలోకంలో విహరించాం. వీలయితే ఇలాంటి ట్రిప్‌లింకా తరచూ వేయాలి'' అన్నాడు మోహన్.

అతని మాటలని మనస్ఫూర్తిగా ఆమోదిస్తూ 'నిజమే' అంది సౌభాగ్య.

ఇంటికి చేరి, రిలాక్స్ అయ్యాక ఆ సాయంత్రం ఇంటిముందున్న లాన్‌లో కూర్చున్నారందరూ.

''నాన్నా! అమ్మ బర్త్‌డేకీసారి ఏ గిఫ్ట్ ఇస్తున్నారు'' అడిగింది కూతురు మనీషా.

''అమ్మ కోరిక ప్రకారం 'ఆలంబన' అనే సదనాన్ని ఏర్పాటు చేస్తున్నాను'' అంటూ వివరించాడు మోహన్.

''ఫెంటాస్టిక్ – మా వంతు సహకారాన్ని మేమూ అందించి – మీ ప్రయత్నంలో పాలుపంచుకొంటాం'' మనస్ఫూర్తిగా చెప్పాడు మోహన్, సౌభాగ్యల కూతురు అల్లుడు, కొడుకూ – కోడలు.

సౌభాగ్య కళ్ళముందు ఎందరికో ఆలంబననిస్తోన్న దృశ్యం కదలాడసాగింది.